క్లుప్తంగా

స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు



లక్ష బిల్వార్చన చేసిన స్ఫటిక లింగం

పెరవలి: అన్నవరప్పాడులో స్ఫటిక లింగ ప్రతిష్ఠ రోజున ఏటా భక్తులకు దర్శనం కల్పిస్తుంటారు. అదేవిధంగా ఈ నెల 29 వరకు స్ఫటిక లింగానికి వివిధ పూజలు నిర్వహించి, 30న భక్తులకు దర్శనం కల్పిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం స్ఫటిక లింగానికి ఉదయం గణపతి హోమం, జ్యోతిర్లింగార్చన, దీక్షా కల్యాణం, రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం లక్ష బిల్వార్చన చేశారు.

మహాలింగేశ్వరునికి అన్నాభిషేకం

దేవరపల్లి: గౌరీపట్నంలో స్వయంభుగా వెలసిన గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామికి గురువారం అన్నాభిషేకం నిర్వహించారు. స్వామివారి ఆలయాన్ని పునఃప్రతిష్ఠాపన చేసి మండలకాలం పూర్తయినందున స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. నిత్యారాధనలు, గణపతి పూజ, హోమం, కుంభారాధన, రుద్రాభిషేకం, విశేష హోమాలు, మహా పూర్ణాహుతి, అన్నసమారాధన, మహానంది అభిషేకం, స్వామివారికి మాండవీధుల్లో ఉత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలు జరిగాయి.

షిర్డీ సాయికి స్టీలు పల్లకీ సమర్పణ

దేవరపల్లి: దేవరపల్లిలో వేంచేసిన షిర్డీసాయి మందిరానికి గ్రామానికి చెందిన కొండక వీరభద్రరావు, వెంకట శ్యామల దంపతులు రూ.40 వేల విలువైన స్టీలు పల్లకీని గురువారం అందజేశారు. సాయినాథుని పల్లకీ ఉత్సవానికి ప్రస్తుతం చెక్క పల్లకీ ఉండగా, స్టీలు పల్లకీని బాబా సేవలకు అందజేసినట్టు దాతలు తెలిపారు. మందిర ప్రధానార్చకుడు అగ్నిహోత్రం సత్యనారాయణాచార్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి ఉత్సవం

దేవరపల్లి: బందపురం గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారికి ఉదయం అభిషేకం, పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. రాజుల పాలనలో వెలసిన ముత్యాలమ్మ తల్లికి ప్రతి ఏటా ఉగాదికి మూడు రోజుల ముందు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాత్రి అమ్మవారికి గరగ సంబరం చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సుందరమ్మకు నివాళి



సుందరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వనిత

నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలో వైఎస్సార్ సీపీ మండల లీగల్‌సెల్ అధ్యక్షుడు గోగులమండ బాబ్జి తల్లి శతాధిక వృద్ధురాలు సుందరమ్మ మృతి చెందారు. గురువారం ఆమె దశ దిన కార్యక్రమంలో మాజీ హోంమంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పాల్గొని సుందరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, నాయకులు బంక అప్పారావు, మద్దూరి నాగేశ్వరావు, తోటవెంకట్రావు, చిన్ని నాగుయాదవ్, గోగులమండ రాజారావు, అందుగుల వెంకటేశ్వరావు, శెనగన సతీష్‌గౌడ్, జాలాధి రవి, ఈడే నిర్మల, కొనకళ్ళ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

పెరవలి: దాళ్వా సాగు చివరి దశలో ఉందని, వారం రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్నింటికీ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎం.మేరీకిరణ్ మాట్లాడుతూ, మండలంలో దాళ్వా సాగు 8,200 ఎకరాల్లో చేపట్టారని, వారం రోజుల్లో కోతలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఇందుకోసం మండలంలో ప్రభుత్వం నుండి 32,574 టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు. ఇందుకు 8 లక్షల గోనె సంచులను మిల్లర్లు సిద్ధం చేశారన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ సిబ్బంది కంప్యూటర్లు, మాయిశ్చర్ మెషీన్‌తో సిద్ధంగా ఉన్నారన్నారు.

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

ఉండ్రాజవరం: పాలంగి సబ్ స్టేషన్ పరిధిలో చివటం ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ పనుల కోసం రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. శుక్ర, శనివారాలు ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారని చెప్పారు. చివటం గ్రామ ప్రజలు గమనించాలని కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

నిడదవోలు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశపు హాలులో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. కౌన్సిల్ సభ్యులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

టెండర్లు పూర్తయినా.. పనులు చేపట్టరేం?

కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల నిలదీత



సమావేశానికి హాజరైన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: టెండర్లు పూర్తయినా పనులు ఎందుకు ప్రారంభించలేదో వివరణ ఇవ్వాలని పదో వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన గురువారం పురపాలక సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధుల నుంచి పదో వార్డులో సీసీ డ్రైన్ల నిర్మాణానికి ఏడాది క్రితం కౌన్సిల్ ఆమోదించడంతో, టెండర్ల ప్రక్రియ, సాంకేతిక అనుమతులు పూర్తయ్యాయన్నారు. గత కౌన్సిల్ సమావేశం నుంచీ అడుగుతున్నా పట్టించుకోవడం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగా ఆపుతున్నట్లు తెలిసిందన్నారు. పనులు తక్షణం ప్రారంభించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నాగరాజు డిమాండ్ చేశారు. దీనిపై కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని కమిషనర్ నాగేంద్ర కుమార్ ఏఈలకు సూచించారు. 13, 17 వార్డుల్లో నాలుగు డ్రైన్లు మంజూరైనా పనులు చేపట్టలేదని టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని చెప్పారు. 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ, పట్టణంలో ఏ వార్డులో ఎన్ని పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాయి, ఎన్ని ప్రారంభించారు, ఇంకా ఎన్ని చేపట్టాలనే వివరాలు కౌన్సిలర్లకు ఇవ్వాలని కోరారు. పట్టణంలో పలుచోట్ల కరెంటు స్తంభాలు కొత్తవి వేసి, పాతవాటిని అక్కడే పడేస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అజెండాలో అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ల ఎన్నిక



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన ప్రసాద్‌రెడ్డికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న గ్రామ కార్యదర్శి అనురాధ

గోపాలపురం: మండలంలోని వెంకటాయపాలెం, కొవ్వూరుపాడు, గోపాలపురం గ్రామ పంచాయతీలకు గురువారం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల సమయంలో జరిగిన ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లు ఒకరికి, మరో రెండున్నరేళ్లు ఇంకొకరికి ఇచ్చేలా కుదిరిన ఒప్పందం ప్రకారం ఆయా పంచాయతీలలో వార్డు సభ్యులతో ఎన్నిక నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. గోపాలపురం ఉప సర్పంచ్‌గా వింత అమర ప్రసాద్‌రెడ్డి, కొవ్వూరుపాడుకు జానపాటి నాగమణి, వెంకటాయపాలేనికి వడ్లమూడి రాజేంద్ర ప్రసాద్ ఎన్నికై నట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పైడి శిరీష, మేకా సతీష్‌బాబు, చిలకా లక్ష్మణస్వామి ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కో-ఆప్షన్ సభ్యుడిగా వజీరుద్దీన్ ఏకగ్రీవం



కో-ఆప్షన్ సభ్యుడు వజీరుద్దీన్‌కు అభినందనలు తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

పెరవలి: మండల పరిషత్‌లో కో-ఆప్షన్ సభ్యుడిగా షేక్ వజీరుద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ పదవికి గురువారం ఎన్నిక జరగటంతో, దీని భర్తీ పూర్తయింది. గత కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్ హఠాన్మరణంతో, ఆ స్థానంలో ఆయన తండ్రి వజీరుద్దీన్‌ను ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన గతంలో నడుపల్లి ఎంపీటీసీ సభ్యుడిగా వ్యవహరించారు. పెరవలి మండల పరిషత్‌లో 20 మంది ఎంపీటీసీ సభ్యులకు 19 మంది హాజరవ్వగా, ఇందులో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు 13 మంది, జనసేన 4, టీడీపీ ఇద్దరు సభ్యులున్నారు. వీరంతా వజీరుద్దీన్ ఎన్నికను ఏకగ్రీవం చేశారు. తొలుత వజీరుద్దీన్ నామినేషన్ వేయగా, ఈయనను ఖండవల్లి ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు ప్రతిపాదించారు. తీపర్రు ఎంపీటీసీ సభ్యుడు రావి వెంకటేశ్వరరావు బలపరిచారు. దీంతో ఎన్నికల అధికారి అయిన మండల పరిషత్ ప్రత్యేకాధికారి ఎం.సునీల్‌వినయ్ ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు ప్రకటించారు. అనంతరం కో-ఆప్షన్ సభ్యుడిగా నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వజీరుద్దీన్‌ను ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి



ఉండ్రాజవరం క్రీస్తు లూథరన్ చర్చి వద్ద క్యాండిల్స్‌తో సభ్యులు

ఉండ్రాజవరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయించాలని ఉండ్రాజవరం క్రీస్తు లూథరన్ చర్చి పాస్టర్ ఆర్.ఇజ్రాయిల్ గురువారం కోరారు. ఆయన మృతిపై క్రైస్తవులకు, ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

నల్లజర్ల: అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ పాస్టర్స్ అసోసియేషన్, మాదిగ రక్షణ పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నల్లజర్లలో శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులపై దాడులు నశించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ముంగమూరి ప్రసాద్, పాస్టర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



నిడదవోలు చర్చిపేటలో ఆందోళన చేస్తున్న క్రైస్తవులు

నిడదవోలు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం అనేక అనుమానాలకు తావిస్తుందని, దీనిపై సమగ్ర విచారణ చేయించాలని కేవీపీఎస్ తూర్పు గోదావరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ, పాస్టర్ ప్రవీణ్ కొద్ది రోజుల క్రితం తనకు ప్రాణహాని ఉందని చెప్పారని, కొందరు మతోన్మాదులు బహిరంగంగానే చంపుతామని సామాజిక మాధ్యమాల్లో హెచ్చరించారని తెలిపారు. ఆ కోణంలో దర్యాప్తు చేసి, నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా సీనేడు అధ్యక్షుడు బిషప్ పాస్టర్ బయ్యే ఆనందకుమార్, పాస్టర్ ప్రసన్నరాజు, చర్చిపేట యూత్, కేవీపీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీలో ఆన్‌లైన్ లావాదేవీలు

పర్సన్ ఇన్‌చార్జి ఉషారాణి



మహాజన సభలో మాట్లాడుతున్న ఉషారాణి

దేవరపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఆన్‌లైన్ లావాదేవీలు జరుగుతున్నాయని, రైతులు బ్యాంకు ఖాతాలకు ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని దేవరపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె.ఉషారాణి తెలిపారు. సొసైటీ సీఈఓ కెఎస్ఎస్ శర్మ అధ్యక్షతన గురువారం జరిగిన మహాజన సభలో ఉషారాణి మాట్లాడారు. రైతు నేస్తంలో గతంలో రూ.40 లక్షల రుణం ఇచ్చేవారని, ప్రస్తుతం దీనిని రూ.25 లక్షలకు కుదించినట్టు ఆమె తెలిపారు. 3 నుంచి 3.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న రైతులకు రూ.25 లక్షలు రుణం ఇస్తున్నామని, దీనిని 12.5 శాతం వడ్డీతో 10 సంవత్సరాల కాలపరిమితిలో డీసీసీబీకి చెల్లించాలని ఆమె తెలిపారు. సొసైటీ సీఈఓ శర్మ మాట్లాడుతూ సొసైటీలో 1,210 మంది సభ్యులు ఉండగా, రూ. 1.28 కోట్లు షేరు ధనం ఉందన్నారు. సభ్యుల పొదుపు డిపాజిట్లు రూ.57.51 లక్షలు, ఫిక్సిడ్ డిపాజిట్లు రూ.9.23 కోట్లు, డీసీసీబీ షేర్ ధనం రూ.94.62 లక్షలు, డిపాజిట్లు రూ.7.16 కోట్లు ఉన్నట్టు ఆయన తెలిపారు. డీసీసీబీకి రూ.14.20 కోట్లు అప్పులు చెల్లించాల్సి ఉందని, సభ్యుల అప్పులు రూ. 19.15 కోట్లు ఉందని వివరించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు రూ.13.53 కోట్ల రుణాలు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. సొసైటీ ద్వారా రూ.2,04 కోట్ల విలువైన వ్యాపారం చేసినట్టు వివరించారు. వాయిదా మీరిన బకాయిలు రూ.40.53 లక్షలు ఉన్నట్టు ఆయన తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ అంచనా బడ్జెట్ ఆదాయం రూ. 2.02 కోట్లు కాగా, వ్యయం రూ.2.01 కోట్లు, మిగులు బడ్జెట్ రూ.10.9 లక్షలు సభలో ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. 2026 నాటికి సొసైటీ ఆవిర్భవించి వందేళ్ల మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రైతు సంఘం ప్రతినిధి ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ 2011 చట్టాన్ని పునరుద్ధరించి కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ఆయన కోరారు. మాజీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, కరుటూరి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

సంఘాల పనితీరు మేరకు వార్షిక ప్రణాళిక

పెరవలి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయ సంఘాలకు వార్షిక రుణం, జీవనోపాధి కల్పనకు ప్రణాళిక రూపొందించడానికి శిక్షణ కార్యాక్రమం నిర్వహిస్తున్నట్టు ఏపీఎం బి.రామకృష్ణ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 1,739 సంఘాలున్నాయని చెప్పారు. వీటిలో బాగా చదువుకున్న వారిని ఎన్యుమరేటర్లుగా గుర్తించి, వారికి కొన్ని సంఘాలు కేటాయిస్తారన్నారు. వాటి పనితీరును బట్టి వార్షిక ప్రణాళిక రూపొందించాలని వివరించారు.

కొవ్వూరు: వచ్చే ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘాల వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళికల తయారీ విధానంపై గ్రామ సంఘ లీడర్లు, ఎన్యుమరేటర్లు మండల సమాఖ్యలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వాడపల్లి క్లస్టర్ పరిధిలో సంఘాలకు సంబంధించి ఈ శిక్షణ అందించినట్టు ఏపీఎం కేవీ నిర్మలకుమారి తెలిపారు. సెర్ప్ ఎస్‌హెచ్‌జీ యాప్ ద్వారా డేటాను సేకరిస్తున్నామన్నారు. సభ్యుల ఆదాయ, రుణ వివరాలు, వార్షిక బడ్జెట్ ప్లాన్, సభ్యుల, ఎస్‌హెచ్‌జీల క్రెడిట్ ప్లాన్ల వివరాలు సేకరిస్తామని చెప్పారు.

రుణ దరఖాస్తుదారులకు నేడు, రేపు ఇంటర్వ్యూలు

దేవరపల్లి: స్వయం ఉపాధి సోపానం పథకంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్ర, శనివారాలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల నుంచి కాపు కార్పొరేషన్ రుణాలకు 303 దరఖాస్తులు, వైశ్య కార్పొరేషన్‌కు 33, కమ్మ కార్పొరేషన్‌కు 54, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 3, క్షత్రియ కార్పొరేషన్‌కు 59, ఈబీసీ 1, రెడ్డి కార్పొరేషన్‌కు 2, మొత్తం 455 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చినట్టు ఆయన తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు 521 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన వివరించారు. 976 మంది అభ్యర్థులు రుణాలకు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. బ్యాంకు రుణంలో 50 శాతం ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ ఇస్తారన్నారు. యూనిట్ విలువ రూ.5 లక్షల వరకు ఉందని ఆయన వివరించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రామన్నపాలెం, 10.30 గంటలకు లక్ష్మీపురం, 11 గంటలకు పల్లంట్ల, మధ్యాహ్నం 12 గంటలకు సంగాయగూడెం, 12.30 గంటలకు త్యాజంపూడి, 1 గంటకు యాదవోలు, 2 గంటలకు యర్నగూడెం గ్రామాలకు చెందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు కరుకూరు, కృష్ణంపాలెం, 10.30 గంటలకు ధుమంతునిగూడెం, 11 గంటలకు దుద్దుకూరు, మధ్యాహ్నం 12 గంటలకు గౌరీపట్నం, 12.30 గంటలకు చిన్నాయగూడెం, 1 గంటకు బందపురం, 2 గంటలకు దేవరపల్లి పంచాయతీలకు చెందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. దరఖాస్తు దారులు ఆన్‌లైన్లో నమోదు చేసిన దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఇతర పత్రాల నకళ్లను వెంట తీసుకుని రావాలని ఆయన తెలిపారు.

ఉపాధి కల్పనపై సమీక్ష

చాగల్లు: ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఉపాధి కల్పన ప్రణాళికపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో ఆర్.శ్రీదేవి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధి పథకం ద్వారా పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టడం, లక్ష్యం మేరకు ఫారం పాండ్ల నిర్మాణం, పంట కాలువలు, సాగునీటి చెరువుల పూడికతీత, సగటు వేతనం రోజుకు కనీసం రూ.290 ఉండేలా చూడటం తదితర ప్రాధాన్యాంశాలను వివరించారు. ఆయా లక్ష్యాలను సాధించేలా ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ, సీవో, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీ వరి దిగుబడులు



నందమూరులో వరి పంట ప్రయోగంలో నమూనా సేకరిస్తున్న అధికారులు

కొవ్వూరు: నందమూరు గ్రామంలో వ్యవసాయ, గణాంక శాఖల అధికారుల ఆధ్వర్యంలో గురువారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన గన్నమని సురేష్ వ్యవసాయ క్షేత్రంలో పీఆర్-126 రకంలో ప్రయోగం కోసం నమునాలు సేకరించారు. పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా, 26.600 కేజీల దిగుబడి వచ్చిందని ఎంఏఓ ఎ.గంగాధరరావు తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు 57 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఈ రబీలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. జిల్లా గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పలకొండ, ఉప గణాంకాధికారి జె.సూర్యనారాయణ, సహాయ గణాంకాధికారి బి.నీలిమ, వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



రోగికి పండ్లు అందజేస్తున్న ముస్లింలు

నిడదవోలు: రంజాన్ మాసం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఖుద్దామీ అహెలే సున్నత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్, జామియా మసీదు ముతవల్లి ఎస్కే అబ్దుల్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి సయ్యద్ రోషన్, కమిటీ సభ్యులు సయ్యద్ నసీరుద్దీన్, ఎస్కే సాబీర్, అలీఖాన్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.